క్లుప్తంగా

నేడు గంగాధరలో జాబ్‌మేళా

గంగాధర: మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి పీఎమ్మార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలో ఆదివారం జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెరుకు శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో నిర్వహించే జాబ్‌మేళాకు 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారని, పదోతరగతి, ఆపై చదివిన నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యవర్గం ఎన్నిక


మల్లేశంను సన్మానిస్తున్న సభ్యులు

రామడుగు: మండలస్థాయి ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి మల్లేశం, గౌరవాధ్యక్షుడిగా ఒంటెల కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గుర్తురి శ్రీనివాస్, అరపల్లి వినోద్, ఎడవెల్లి మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా కాశిపాక బాబు, సభ్యులుగా గజ్జెల రాకేశ్, కుమ్మరి శ్రీహరి, కల్లెపల్లి కిరణ్, గట్టు ప్రశాంత్, ఎడవెల్లి నాగరాజు, బత్తిని శ్రీనివాస్, బత్తిని బాలకృష్ణ, ఎండీ సోహెల్ ఎన్నికయ్యారు.

గన్నేరువరం: తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా గన్నేరువరంకు చెందిన పుల్లెల జగన్మోహన్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్యగౌడ్ తెలిపారు. కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియామక పత్రాన్ని జగన్మోహన్‌కు అందజేశారు.

ఎన్నికలపై అవగాహన

గంగాధర: లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని నరేంద్ర విద్యాలయంలో శనివారం ఎన్నికల విధానంపై మోడల్ ఎన్నికలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు హౌస్ లీడర్లను ఎన్నుకున్నారు. చదువుతోపాటు అన్ని రంగాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం రాజేశం, గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిగురుమామిడి: నవాబుపేట్ గ్రామానికి చెందిన బోయిని సంపత్(40) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. స్థానిక మాదిగ కులస్తులు రూ.34,400 ఆర్థిక సాయం అందించారు. సంపత్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బోయిని ఆదిమల్లయ్య, సదయ్య, కొమురయ్య, సంపత్, వెంకటయ్య, రాజయ్య, జగతిపాల్, సతీశ్, మనోజ్‌కుమార్, వేణు, మట్టేల కొంరయ్య, మొండయ్య, కాశపాక లక్ష్మయ్య ఉన్నారు.

శంకరపట్నం: కేశవపట్నం గ్రామంలో ఇటీవల మరణించిన గుండారపు రాధ కుటుంబాన్ని పూర్వ విద్యార్థులు పరామర్శించి రూ.36వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మృతురాలి భర్త మురళితో కలిసి చదివిన 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన స్నేహితులు వెంకటేశ్వర్లు, మహేందర్, శ్రీనివాస్, అనిల్, ఫయాజ్, శ్రీకాంత్ పరామర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ దూరవిద్యలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం ప్రకటన విడుదలయిందని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేశ్, కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 30 లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కాటమయ్య కవచంపై శిక్షణ

జమ్మికుంట: జగ్గయ్యపల్లి గ్రామంలో కరీంనగర్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అధ్యక్షతన జమ్మికుంట ఎక్సైజ్ సీఐ మాధవీలత ఆధ్వర్యంలో గీత కార్మికులకు కాటమయ్య కవచం శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సీఐ మాధవీలత మాట్లాడుతూ.. గీత కార్మికులు చెట్లు ఎక్కే సమయంలో కాటమయ్య కవచం రక్షణగా ఉంటుందన్నారు. ఎక్సైజ్ పోలీసులు, గౌడ సంఘం నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి నవోదయలో కళోత్సవం

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆది, సోమవారాల్లో కళోత్సవ్–2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. టూడీ, త్రీడీ విసువల్ ఆర్ట్స్, చిత్రకళలు, క్లాసికల్ మ్యూజిక్, నృత్యాలు వంటి కార్యక్రమాలుంటాయన్నారు.


సన్మానం

చిగురుమామిడి: బొమ్మనపల్లి గ్రామంలో డాక్టరేట్ పట్టా పొందిన కొంకట అనూష–నరేశ్ దంపతులను స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనూష ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రానిక్స్ అగ్రికల్చర్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. మొదటిసారిగా స్వగ్రామానికి రావడంతో అనూష దంపతులను సన్మానించారు.

చెక్‌డ్యామ్‌లు వృథా..!

- డిజైన్ లోపంతో గండి పడి నిరుపయోగం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


చుక్క నీరు లేని చెక్‌డ్యామ్


పాతర్లపల్లిలో చెక్‌డ్యామ్‌కు గండి

ఇల్లందకుంట: రూ.కోట్లతో పాతర్లపల్లి–మల్యాల పరిధిలో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు రైతులకు ఉపయోగపడడం లేదు. చెక్‌డ్యామ్ వద్ద వరద నీరు నిలవాలి.. లేదా దానిపై నుంచి ప్రవహించాల్సి ఉన్నా అలా జరగడం లేదు. గండి పడి నీళ్లు చెక్‌డ్యామ్ పక్కనుంచి ప్రవహిస్తున్నాయి. సామర్థ్యం లేనిచోట వద్దని రైతులు మొత్తుకున్నా వాటిని నిర్మించారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణంలోని డిజైన్ లోపాలతో ఇంజినీర్ల వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది.

తాగు, సాగునీటి సమస్య ఉండొద్దని..

నీరు నిలువ ఉండి భూగర్భ జలాల నీటి మట్టం పెరిగి ప్రజలు, రైతులకు సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండొద్దని గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్లు ధారపోసి చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. కానీ పైనుంచి వచ్చే వరద ప్రవాహాన్ని అంచనా వేయడంలో సంబంధిత అధికారులు విఫలమవడంతో మల్యాల, పాతర్లపల్లి పరిధిలో నిర్మించిన 7 చెక్‌డ్యాముల్లో ఒకటి మాత్రమే తెగకుండా ఉంది. మిగతావి గండి పడిన సందర్భంలో పలుమార్లు మరమ్మతు చేపట్టినా.. వరద ఉధృతికి మళ్లీ గండి పడి మరమ్మతు లేక నీరంతా వృథాగా పోయి వాటి నిర్మాణం నిరుపయోగంగా మారింది. చెక్‌డ్యామ్‌లపై ఆధారపడి వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తిందని ఆయా గ్రామాల అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని వాపోతున్నారు. గుత్తేదారులు, అధికారుల కాసుల కక్కుర్తితో ప్రజాధనం వృథా అయ్యిందని రైతులు, స్థానికులు మండిపడుతున్నారు.

డిజైన్ లోపంతో..

పాతర్లపల్లి వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్‌కు ఇటీవల కురిసిన వర్షానికి భారీ గండి పడింది. మల్యాల పరిధిలోని చెక్‌డ్యామ్‌కు రెండేళ్లలో రెండుసార్లు గండి పడగా.. మరమ్మతు చేశారు. కానీ తిరిగి మళ్లీ భారీ గండి పడింది. దానికి మరమ్మతు చేపట్టకుండానే వదిలేశారు. దీంతో వరద నీరంతా వృథాగా పోతోంది. ఇదే గ్రామం కింద ఉన్న మరో చెక్‌డ్యామ్ కట్టిన ఏడాదికే తెగింది. రైతులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. గ్రామానికి చెందిన కొందరు రైతులు స్వయంగా మరమ్మతు చేసుకున్నారు. కానీ మళ్లీ గండి పడగా.. దానిని అలాగే వదిలేశారు. వాగొడ్డు రామన్నపల్లి వద్ద సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ బ్యాక్ వాటర్‌తో పంటలు మునిగి నష్టం వాటిల్లుతుందని రైతుల గగ్గోలుతో రెండేళ్ల క్రితం అధికారులు చెక్‌డ్యామ్ ఎత్తును సుమారు రెండు ఫీట్ల మేర కూల్చివేశారు. దీంతో నీరు నిల్వ ఉండక ప్రజాధనం వృథా అయిందని బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని గతంలో కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీర్ల వైఫల్యంతోనే చెక్‌డ్యామ్‌లు నిరుపయోగంగా మారాయని రైతులు, ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



మా గ్రామ పరిధిలో మూడు చెక్‌డ్యామ్‌లున్నాయి. గతంలో ఒక దానికి గండి పడింది. అధికారులకు చెప్పాం. కానీ పట్టించుకోలేదు. రైతులందరం కలిసి గండిని పూడ్చాం. కానీ మళ్లీ తెగిపోయింది. మరొకటి ఇటీవల కురిసిన వర్షానికి గండి పడి నీరు వృథాగా పోతోంది. గండి పడిన వాటికి వెంటనే మరమ్మతు చేపట్టాలి. ఇప్పటివరకు ఏ అధికారి గానీ నాయకులు గానీ చూడటానికి రాలేదు. వందలాది ఎకరాలు చెక్‌డ్యామ్ నీళ్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నాం. అప్పులు చేసి పెట్టుబడి పెట్టాం.

– చల్లూరి కృష్ణ, రైతు, పాతర్లపల్లి

నిరుపయోగంగా చెక్‌డ్యామ్‌లు



మల్యాల–పాతర్లపల్లి పరిధిలో నిర్మించిన పలు చెక్‌డ్యామ్‌లకు గండి పడి రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండా నిరుపయోగంగా మారాయి. మరమ్మతు కోసం రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం. వరద ఉధృతిని అంచనా వేయడంలో ఇంజినీర్లు వైఫల్యం చెందారు. ప్రజాధనం వృథా చేసిన సంబంధిత అధికారులపై వెంటనే స్పందించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. లేదంటే రైతుల పక్షాన ఆందోళన చేపడతాం.

– చెల్పూరి రాము, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు

పంట పండేటట్లు లేదు



చెక్‌డ్యామ్ పక్కన రెండెకరాల వ్యవసాయ భూమిలో వరి పంట సాగు చేస్తున్నా. దీనిపై ఆధారపడి నాటు వేశా. బావి లేదు. మొన్నటి వర్షానికి చెక్ డ్యామ్‌కు గండి పడి వరద నీరు కిందికి పోతోంది. ఇప్పుడు నీళ్లు లేక పంట రావడం కష్టమే. ఎండిపోయేటట్టుంది. ప్రభుత్వం సాయం చేయాలి.

– అన్నం తిరుపతి, రైతు, పాతర్లపల్లి


చొప్పదండి: పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలో రోడ్డు నుంచి సంతోష్‌నగర్ వెళ్లే దారిలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడిన ప్రతిసారి నీటి గుంతలతో కాలనీవాసులు తిప్పలు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలి.

– మహమ్మద్ వలీఖాన్, చొప్పదండి

ఈ సమస్యపై ప్రశ్నించాల్సిన అధికారి
నాగరాజు, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి, సెల్ నం.: 9949267882

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బదిలీ

చొప్పదండి: రుక్మాపూర్ శివారు మోడల్ స్కూల్ నూతన ప్రిన్సిపాల్‌గా నిమ్మల సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న కోల రమేశ్ రామడుగు మండలానికి బదిలీపై వెళ్లగా.. సుధాకర్ బోయిన్‌పల్లి నుంచి బదిలీపై వచ్చారు.

శంకరపట్నం: కేశవపట్నం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి వరంగల్ జిల్లా అమీనాబాద్ మోడల్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. కేశవపట్నం మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న 16 మంది టీచర్లు బదిలీ కాగా.. 19 మంది టీచర్లు బదిలీపై వచ్చారు. ఎలగందుల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరిత బదిలీపై కేశవపట్నం మోడల్ స్కూల్‌కొచ్చారు.

సమ్మిరెడ్డి మృతి తీరని లోటు

వీణవంక: జమ్మికుంట ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మండల సీనియర్ నాయకుడు గంగాడి తిరుపతిరెడ్డి, ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, పంజాల సతీశ్, కొండాల్‌రెడ్డి అన్నారు.

బెస్ట్ ఎడ్యుకేటర్‌గా లక్ష్మారెడ్డి

గంగాధర: మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయం కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డును అందుకున్నారు. ఆల్ ఇండియా ప్రయివేట్ స్కూల్స్ అసోషియేషన్, డిజిటల్ శాటిలైట్, ట్రస్మా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అవార్డుకు ఎంపిక చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందజేశారు.

నాయకులను నిర్బంధించడం సరికాదు

వీణవంక: రాష్ట్రంలోని కరికెగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణ కోసం పౌరహక్కుల సంఘం నాయకులు మూడు బృందాలుగా వెళ్తుండగా వారిని అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమని తెలంగాణ ప్రజాఫ్రంట్ కార్యదర్శి అరెల్లి మల్లాగౌడ్, ప్రధాన కార్యదర్శి అయిందాల అంజన్న ఒక ప్రకటనలో ఖండించారు.

తెలంగాణ సెంటిమెంట్‌తో అరాచకం

గన్నేరువరం: తెలంగాణ సెంటిమెంట్‌తో రాష్ట్రంలో అరాచకం సృష్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ అన్నారు. గన్నేరువరంలో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ మెప్పు కోసం కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలని చూస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నిమజ్జనోత్సవం విజయవంతం చేయాలి


చొప్పదండి: కరపత్రం ఆవిష్కరిస్తున్న హిందూ ఉత్సవ సమితి

చొప్పదండి: హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం నిర్వహించే గణేశ్ నిమజ్జనోత్సవాలను పట్టణ ప్రజలు విజయవంతం చేయాలని వీహెచ్‌పీ పట్టణ శాఖ అధ్యక్షుడు పడకంటి కృష్ణ, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ఎన్నం మునిందర్ కోరారు. శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో శనివారం సభ్యులతో కలిసి నిమజ్జన కరపత్రం ఆవిష్కరించారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహిస్తున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చేపూరి సత్యనారాయణ, దండె లింగన్న, సిరిపురం శ్రీనివాస్, దండె సత్యానందం, చెట్టిపల్లి కిషన్, దండె మహేశ్, చల్ల అనూష్, రొడ్డవేని రాజు, చిలుకనూరి లక్ష్మీరాజం, కొత్తపల్లి శ్రీనివాస్, కొక్కుల ప్రణీత్, మామిడాల రమణ, పంజాల గంగయ్య, ఇప్పనపల్లి కొమురయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణేశుడి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలి

మానకొండూర్: గణేశుడి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులకు సూచించారు. మానకొండూర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కరీంనగర్ పట్టణం నుంచి వందలాది భారీ వినాయక విగ్రహాలు ఇక్కడ నిమజ్జనం చేస్తారని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని, భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తహసీల్దార్ రాజేశ్వరి, నందగిరి రవీంద్రచారి, మర్రి ఓదెలు, రామిడి తిరుమల్‌రెడ్డి, సాయిరి దేవయ్య, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, రాజు, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపల్లి సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


జమ్మికుంట: అంబేడ్కర్‌కాలనీలో దీపోత్సవం


చొప్పదండి: గణేశ్‌నగర్‌లో మహిళల కుంకుమ పూజలు


శంకరపట్నం: కేశవపట్నంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


తిమ్మాపూర్‌లోని శ్రీహోమ్స్‌కాలనీలో దీపారాధన

ఏకదంతాయ.. వక్రతుండాయ..

వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకుంటున్నారు. శనివారం హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల్లోని మండపాల్లో కుంకుమార్చనలు, అన్నదానాలు, దీపోత్సవం, పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, తిమ్మాపూర్‌లో బత్తుల అపర్ణ, మంగ, మంజుల, రాధ, అనిత, శారద, శ్రీలత, యశోదబాయ్, వరలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


చిగురుమామిడి: కొండాపూర్‌లో 56 రకాల నైవేద్యాలు సమర్పించిన భక్తులు

బెల్టు షాపులపై దాడులు

వీణవంక: మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్టు షాపులపై దాడులు నిర్వహించి రూ.50వేల మద్యం పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. నర్సింహులపల్లి గ్రామంలో శ్రీనివాస్ అనే వ్యక్తి బెల్టు షాపులో రూ.7,530 మద్యం, చల్లూరులో గర్వందుల శివకృష్ణ బెల్టు షాపులో రూ.32,260, కొత్తపల్లి గ్రామంలో బోడిపల్లి కోటేశ్వర్ ఇంట్లో రూ.11,150 మద్యం పట్టుకున్నామని, కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఇసుక ట్రాక్టర్..

పోతిరెడ్డిపల్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామానికి చెందిన పర్శరాములు తన ట్రాక్టర్‌లో మానేరు వాగు నుంచి ఇసుక తీసుకొని వీణవంక గ్రామ శివారులోకి రాగానే పట్టుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

గుండ్లపల్లిలో..

గన్నేరువరం: గుండ్లపల్లిలో శనివారం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దేవక్కపల్లి నుంచి అనుమతి లేకుండా ఇసుకతో వెళ్తుండగా గుండ్లపల్లిలో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం..

శంకరపట్నం: మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద శనివారం రేషన్ బియ్యం ఆటో పట్టుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. తాడికల్ గ్రామానికి చెందిన నరాల అంకూష్ పలు గ్రామాల్లో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నాడన్నారు. 19 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు.

వెంటాడుతున్న విధి..

శంకరపట్నం: విధి ఆ కుటుంబాన్ని వెంటాడుతోంది. హాస్టల్‌లో చదువుతున్న కూతురును చూసేందుకు వెళ్తుండగా.. సిద్దిపేట జిల్లాలో జరిగిన ప్రమాదంలో ఆటో పల్టీలు కొట్టి ఆటో నడుపుతున్న శంకరపట్నం మండలం చింతగుట్ట మాజీ సర్పంచ్ రజిత భర్త లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రజితకు గాయాలై ఆస్పత్రిపాలైన విషయం విదితమే. 2023 ఆగస్టు 12న వీరు ప్రయాణిస్తున్న ఆటోను కారు ఢీకొనడంతో ఇద్దరు గాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. కరీంనగర్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్లేందుకు రజిత కూతరు లాస్య తాడికల్ బస్టాండ్ వద్ద ఉండగా.. ఇటీవల డీజిల్ ట్యాంకర్ బోల్తా పడి లాస్యకు తీవ్ర గాయాలయ్యాయి. మాజీ సర్పంచ్ రజిత ప్రాణాలతో బయటపడింది. ఇప్పుడిప్పుడే లాస్య కోలుకుంటోంది. శనివారం చింతగుట్ట నుంచి తాడికల్‌కు ఆటోలో భర్త లక్ష్మణ్‌తో కలిసి రజిత వస్తుండగా.. తాడికల్‌లో కేశవపట్నం నుంచి చింతగుట్ట వెళ్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ ఆటో దెబ్బతినగా.. భార్యభర్తలు క్షేమంగా బయటపడ్డారు. ప్రమాదంపై కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరుస ప్రమాదాలతో ఆ కుటుంబం ఆందోళనకు లోనవుతోంది.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

గన్నేరువరం: జంగపల్లి గ్రామానికి చెందిన ఆటో యూనియన్ గ్రామ అధ్యక్షుడు గుంటుక రాజేశం (59) అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో మృతిచెందాడు. పది రోజుల క్రితం అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరాడు. వైద్యానికి సుమారు రూ.7లక్షల వరకు ఖర్చయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సనాతన సంప్రదాయాలను కాపాడుకోవాలి


నృత్యం చేస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్: సనాతన భారతీయ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాంటిస్సోరి ప్రధానోపాధ్యాయురాలు గీతా షాజు అన్నారు. శనివారం పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓనం కేరళలో అతి పెద్ద పండుగని అన్నారు. విద్యార్థుల కై కొట్టికలి నృత్యాలు, ఉపాధ్యాయుల కేరళ సంప్రదాయ వస్త్రధారణ ఆకట్టుకున్నాయి. డైరెక్టర్లు షాజు థామస్, నూకల శ్రీనివాసరావు, గండ్ర సుధాకర్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఎస్సైకి కృతజ్ఞతలు

తిమ్మాపూర్: పోరండ్ల గ్రామానికి చెందిన మామిడి మొగిలి కూతురు అఖిల ప్రేమోన్మాది చేతిలో మోసపోయి గత నెలలో ఆత్మహత్య చేసుకుంది. తన చావుకు అంగోత్ భరత్, అతడి తల్లిదండ్రులని సూసైడ్ నోట్ రాసింది. తండ్రి మొగిలి ఫిర్యాదు మేరకు తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అఖిల చావుకు కారణాలను తెలుసుకొని నిందితుడైన అంగోతి భరత్‌ను అరెస్టు చేయడానికి నెల రోజులుగా గాలించారు. కొత్తగా వచ్చిన ఎస్సై తాండ్ర వివేక్ ఈ కేసును చాలెంజ్‌గా తీసుకొని నిందితుడిని చార్జి తీసుకున్న మూడు రోజుల్లోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మండల పరిధిలోని ఉద్యమకారులు ఎస్సైని శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి

వీణవంక: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను విస్మరించిందని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు ఓరెం భానుచందర్ అన్నారు. కోర్కల్ గ్రామంలో మాట్లాడారు. రైతులను గోస పెడుతున్న ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. రైతు భరోసాతోపాటు రూ.2లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయాలని కోరారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ పోటీలు

చిగురుమామిడి: మండలంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీలు ముగిశాయి. రెండు రోజులుగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం ఎంపీడీవో ఖాజామొయినోద్దీన్, తహసీల్దార్ రమేశ్ బహుమతులు ప్రదానం చేశారు.

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి


దామోదర్‌రావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మర్రి వెంకటస్వామి

రామడుగు: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా గుండి గ్రామంలో రైతాంగ సాయుధ పోరాట అమరుడు గుండి దామోదర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోయ్యడ సృజన్‌కుమార్, మండల కార్యదర్శి గోడిశెల తిరుపతిగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేశ్, ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్, మడ్డి శ్యాంసుందర్‌గౌడ్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, మ్యాకల నాగరాజు, మచ్చ పవన్‌కళ్యాణ్, మల్లేశం, కనకయ్య, హరీశ్, నాంపల్లి, రాజయ్య పాల్గొన్నారు.

కేజీబీవీలో హిందీ దివస్


హిందీ ఆకృతిలో కేజీబీవీ విద్యార్థినులు

శంకరపట్నం: కేశవపట్నం కేజీబీవీలో శనివారం హిందీ దివస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు హిందీ ఆకృతిలో కూర్చున్నారు. హిందీ భాషపై విద్యార్థినుల చిత్రాలు ఆకట్టుకున్నాయి.